

## నిజం దాగుతుందా?

అన్నదమ్ములిద్దరికీ వయస్సులో తేడా తొమ్మిదేళ్లు. అన్న బికాం చదివితే తమ్ముడు యంబియే. అన్న రమణ ప్రోద్బలం ప్రోత్సాహంతోనే తమ్ముడు రాజా బిజినెస్‌లోకి దిగాడు. వయస్సులోనేగాదు అన్నదమ్ముల స్వభావంలోనూ తేడా వున్నది. చురుకైన రాజా త్వరలోనే వ్యాపారంలో నష్టమొస్తున్నదిగానీ లాభాల్లేవని గ్రహించాడు. అన్న స్వభావమూ నచ్చలేదు రాజాకి. గిల్లి కజ్జా పెట్టుకోటం, తలబిరుసుతనం, పొగరు, అవమానించి వినోదించటం, దూబరా, మనిషిని మోసగించటంలో వున్న యిష్టత ఆనెస్టీలో లేదు.

''అన్నా! మనం స్నేహంగానే విడిపోదాం. ఒకళ్లకొకళ్లం సాయంగా వుందాము. వైరమొద్దు. నీవు భక్తి మార్గం తొక్కు. భగవంతుని తోడ్పాటుంటుంది. అమ్మ నాన్నా మన స్వగ్రామం వదిలి, భూమాతను నిరసించి రామన్నారు''.

అన్న రమణ విని వూరుకున్నాడు. కూరల అంగడేగా భాగం అడగడు తమ్ముడు.

రాజా తన భార్యా వాసవితో తమ కొద్ది సామాను తీసుకుని దూరంగా వెళ్లి మంచి యింట్లో స్థిరపడి వ్యాపారం మొదలెట్టాడు. నోరు మంచిదైతే వూరు మంచిదౌతుంది. మెల్లిగా, కిరాణా, ఫాన్సీ గూడ్సు, వంట నూనెల ప్యాకెట్సూ తినబండారాల పొట్లాలూ, ఇన్‌స్టెంట్ పొట్లాలూ, బ్రెడ్ కలకలలాడినై. టెంకాయలు వచ్చాయి.

ఇద్దరు కొడుకులు గలిగి, బడికెళ్తున్నారు. వాసవి మిల్క్ పార్లర్, టీ స్టాల్ నడుపుతున్నది. ఆమె మేనత్త విశాల విడో వచ్చి వారికి యింటి పనుల్లోనే గాక, వ్యాపారంలోనూ సాయంగా వున్నది.

మంచి పేరుతో బాటు, అభివృద్ధీ, పిల్లలు పోటీల్లో పాల్గొని బహుమతులు తేవటం గూడా జరుగుతున్నది. రోలర్ స్కేటింగ్‌లో రామూ ఫస్ట్ వచ్చి ప్రైజ్ కొడితే, యీత కొలను పందెంలో రవి ఫస్ట్ వచ్చి పతకం తెచ్చుకున్నాడు.

గోసంరక్షణ సంఘమున్నది. పెద్ద గోశాల నడుపుతున్నారు పురనివాసులు. ముసలి అవులను యెద్దులనూ కబేలాకు తోలనివ్వకుండా తాము కొని గోశాలలో వుంచుతారు. వాటి కసవు, పేడా యెరువుగా అమ్ముతారు. వారానికోసారి వాటినన్నిటినీ తోలుకెళ్తూ నాణేలు వేసే రంధ్రమున్న డబ్బా వాయిస్తూ సన్నాయి వాయిస్తూ తిరిగి వస్తూ ఫండ్స్ కలెక్ట్ చేస్తారు సంఘ సభ్యులు.

రాజాకి ఆ సంఘ సభ్యులలో స్నేహితున్నారు. అంతేకాక రాజాకి అనుయాయులు అభిమానులూ యేర్పడ్డారు. పరపతిగలవాడైనాడు. ఒక అనుయాయి కూడా నడుస్తూ,

''రాజా! అంగరక్షకుడిని పెట్టుకుంటే మంచిదేమో, పచ్చపచ్చగా కనబడుతున్నావు'' అని హాస్యమాడాడు. అంగ రక్షకుడెందుకు నాగయ్యా? యెవరన్నా పొంచివుండి మీదబడి చంపుతారంటావా? నాకెవరితోనూ వైరం లేదే?'' అలా అంటూ గోశాల పెద్దగేటు దాటి లోపలికెళ్లాడు రాజా. తాను తెచ్చిన అరిటి పళ్లు ఆవులకూ యెద్దులకూ అందించాడు. హుండీలో వందనోటు వేశాడు. అక్కడి పనివాళ్లు దణ్ణాలు పెట్టారు.

పాతబట్టలు అతి చౌకగా నిరుపేదలకమ్మే అంగడికెళ్లి కొట్టువాని యెదట గుడ్డల మూట వుంచాడు. చిన్న పిల్లల బడివేపు వెళ్లి అక్కడ నిలబడి వున్న నలుగురు పిల్లలకి పలకా బలపాలందించాడు. ఈ పన్లకి సాయపడుతూ వెంటవస్తున్న అనుయాయి ఘోష తగ్గలేదు.

''రాజా! అసూయ యేమైనా చేయిస్తుంది. బాగుపడాలని లేనివారికా గుణం హెచ్చు. అదీ జబ్బే. ముదురుతుంది గూడాను. మీ వదిన, శారద నిన్నభిమానించి ఆపేక్షగా మాట్లాడటం, తరుచూ మీ యింటికి రావటం బాగా లేదు. ఆమె చెల్లెలు ఐపియస్ పాసై పోలీస్ ఫోర్స్‌లో పనిచేస్తున్నది. ఆ సుశీలమ్మ గూడా తన బావను ఆటలు పట్టిస్తూ, సరసాలాడుతుంటే మందలించటం చూశాను రాజా!'' అని ఆగాడు.

''యేమంటుందేం? ఆమె మాటలకూ నాకూ సంబంధమేమిటీ?''

''బావా నీ స్నేహాలు బాగా లేవు. నువు దాచినా అవిపైకి తేలుతున్నాయి. అరెస్టు చేసే అవకాశం నాకు కల్పిస్తున్నావు. నీ లైసెన్సులు చూద్దామావోసారి'' అంటుంది. మాంచి ఒడ్డూ పొడుగూ, చలాకీ, ఆ యూనిఫామ్‌లో వుంటూనే సుశీల నిన్నభిమానిస్తున్నది రాజా! ఆమే బాడీగార్డ్‌ను పెట్టుకోమని నీతో చెప్తానంటున్నది''.

''అదో ఖర్చు నాగయ్యా. జాతీయపిత బాపూజీకీ యీ సలహా యిస్తే నవ్వాడు బాపూ. మీరాబెన్‌తో అన్నాడు.

''బెన్! నేను హత్యచేయబడ్డానని వినగానే యెక్కడిపన్లు అక్కడ వదిలేసి ఆవేశంతో పరుగెత్తుకు రాకు. కాలగర్భంలో సజ్జనులు పుట్టినట్టే, వారిని చంపేందుకు దుర్జనులూ పుడతారు'' అంతేనా నాగయ్యా! బాపూచెణుకులు విసిరేవారుట. ''యుకెన్ కిల్‌ది రాస్కెల్ గాంధీ. బట్ యు కెనాట్ కిల్ ది ఐడియాస్ హీ ప్రాపగేటెడ్'' నీకీ ఆలోచననెందుకొచ్చిందసలూ నాగయ్యా!'' అన్నాడు నడుస్తూనే.

''మీ అన్న నష్టాల నెదుర్కోలేక దుర్జనులను చేరదీస్తున్నాడని చెప్పుకుంటున్నారు. అడ్డదారులు తొక్కుతూ లాభాలు కళ్లజూడాలని ప్రయత్నిస్తున్నాడట. రాజా! కనీసం కూడా మిత్రులనన్నా రానీ'' అలా అంటూ నాగయ్య మరొకరు కలిస్తే వారితో వెళ్లిపోయాడు.

రాజా తన బిజినెస్ వేపు నడిచాడు.

2

పట్టపగలు నడిరోడ్డుమీద దారుణ హత్య. పేరు ప్రఖ్యాతులూ, పరపతీ పెరుగుతున్న రాజా అనే వ్యాపారస్థుని, గుర్తు తెలియని మనుషులు, మొహాన నల్లని గుడ్డలతో హఠాత్తుగా వచ్చి, భోజనానికి యింటికి వెళ్తున్నవానిని కత్తులతో పొడిచి పారిపోయారు. జనం పోగై, రాజాను మోసుకెళ్లి దగ్గర్లో వున్న నర్సింగ్

హోమ్‌లో చేర్చారు. కాని చనిపోయాడని డాక్టరు వెల్లడించి సర్టిఫై చేశాడు. పోలీసుశాఖ వారు రంగం మీదికి వచ్చారు. అన్నీ విని ఎంక్వయరీ జరుపుతున్నారు. హత్యకు కారణాలు యింకా తెలియరాలేదు. అనుమానితులను, పాత నేరస్థులను, కిరాయి హంతకులను కలిసికొని విచారణ జరుపుతున్నారు. హతుని వంటి మీదున్న బంగారుగొలుసు, చేతి వాచీ, లాల్చీ జేబులోని మనీపర్స్ అలాగే వున్నాయి. వైరం వల్లే హత్య జరిగిందని అంటున్నారు పోలీసుశాఖవారు.

దినపత్రిక మొదటి పుటమీద బొమ్మలు చూసి, వార్త చదివి రమణ భార్య శారద వీధిలోకి చూస్తే యింకా జనం పరుగెత్తుతున్నట్టే తోచి, యేడుపు మొహంతో తానూ వెళ్లింది. తల్లి వెళ్లటం చూసిన యిద్దరు కొడుకులూ, కిందబడేసిన పత్రిక వంక చూస్తున్న తండ్రిని చూచారు. తండ్రి పత్రిక అందుకుని వివరాలు చదవలేదు. నిర్విచారంగా, ఆశ్చర్యమన్నా వెల్లడించకుండా చూచాడు కొడుకుల వంక.

''మనం బాబాయి యింటికి పోదామా నాన్నా?'' అనడిగారు.

''మీ అమ్మకి లేడికి లేచిందే ప్రయాణమని అలా పరుగెత్తటం అలవాటే'' అని వూరుకోక, వెళ్దాము అనీ అనక, ''డబ్బు అందించేవాడని యేడుపొచ్చి వుందేమో. యెవరో నీచులు దొంగదెబ్బ తీసి వుండాలి. వాళ్లవాళ్లని పట్టించాడేమో రాజా!'' అన్నాడు. పిల్లలిద్దరూ వీధి వాకిలివేపు నడవటం చూసి, ''వుండండి. నేను వస్తున్నా తలుపు బార్లాతీసి పోదామాయేం? తాళం బిగించి వస్తున్నా'' అన్నాడు తండ్రి.

## 3

నెలరోజులు పట్టింది దోషిని హంతకుని కోర్టులో బోనులో నించోబెట్టటానికి. కేసును వేరేవేపు మళ్లించేప్పటికి, కథలు పుట్టినై. సాక్షులూ అందలేదు. రాజా అనుయాయులు వూళ్లో లేరు. శబరిమలై వెళ్లారు అయ్యప్పను దర్శించటానికి. వారిలో కొంతమంది ఐపియస్ ఆఫీసర్ సుశీలకి తెలుసు. వారికి సాయపడింది గూడాను. వారి బిడ్డలు పోలీస్‌ఫోర్సులో సెలెక్టు అయేట్టు

చూసింది. నిండా ఆరడుగుల ఎత్తు, నూరు పౌన్ల తూకం, ముప్పై ఆరంగుళాల ఛెస్ట్ కొలత టెన్త్ క్లాస్ జస్ట్ పాస్ అయితే చాలు. అనుయాయులు అందేప్పటికి కొంత ఆలస్యమైంది. చివరికి నాగయ్య చెప్పిన విషయాల వల్ల, అప్పులలో మునిగిన అన్నే పథకం వేశాడని తేలింది. అప్పటికీ సయానా బావగార్ని దోషి అని న్యాయస్థానంలో నిలబెట్ట వెనకాడింది సుశీల. అక్క పిల్లలు తనను గురించి యేమనుకుంటారోనని వెరిచింది. విధి లేనట్లు నేర నిరూపణలో యాక్టివ్ పార్ట్ తీసుకున్నది. పెద్ద కష్టం లేకుండా సాక్ష్యాధారాలందాయి. సాక్షులూ అందారు.

ఈ నెలరోజులలో శారద యింటికి వస్తూపోతూ వున్నదిగానీ భర్తతో ఘర్షణా పడలేదు. అతన్ని నిగ్గదీయనూ లేదు. గడిచిపోయిన రోజులో భర్తచూపులూ, నడవడీ, దూషణ, కొట్టరావటం, అర్థంలేని మతిలేని మాటలు గుర్తు వచ్చి మౌనంగా వుండిపోయింది. వంటా యిల్లు మానేజ్ చేయటం చేస్తున్నా హౌస్‌కీపర్లాగా వుండిపోయింది శారద తండ్రిమీద నేరాలూ చెప్పలేదు పిల్లలకి. ఈర్ష్యాసూయలకు లోనైన భర్తకు మంచి చెప్పి లాభం లేదనుకున్నది.

''వారి పంచనే పడి వుండరాదూ? ఇక్కడ నువు లేకపోతే లోటేమీ లేదు'' అన్నాడోనాడు.

''పుట్టెడు దుఃఖంలో వున్న తోడుకోడల్ని చూడవెళ్లినా తప్పే? సానుభూతి చూపినా తప్పే? మీకు తెగినట్టు అందరికీ బంధం తెగదు'' అని కళ్లద్దుకున్నది.

4

కోర్టు నిండిపోయింది. బయటా వున్నారు జనం. విచారణ మొదలై, ప్రిలిమనరీ హియరింగ్ ముగిసి, ఆచారప్రకారం ప్రమాణాలూ ముగిశాయి. బోనులో నేరస్థుడు స్థిరంగా నిలబడి బోను ఖడ్డీపట్టుకుని వున్నాడు.

''యేమని చెప్పుకుంటావు? పాత నేరస్థులూ, కిరాయి హంతకులూ, తుదకు నీ మిత్రులూ గూడా సాక్ష్యమిచ్చి నీ నేర నిరూపణ చేశారు. రికార్డయింది. కాసెట్‌లు అందాయి. బాగా ఆలోచించే చెప్పు. దోషివా నిర్దోషివా?'' అనడిగారు

న్యాయాధీశులు.

''నా వుద్దేశాల ప్రకారం నేను దోషినిగాననే అంటాను యువరానర్. అప్పుల్లో పీకల వరకు మునిగి వున్నాను. అయిదు లక్షలు అప్పు యియ్యి మెల్లిగా తీరుస్తాను అని మధ్యవర్తుల ద్వారా అడిగిస్తే డబ్బు వుండీ యివ్వలేదు హతుడు. నీతీ, దయా, సత్ప్రవర్తనా, వున్నదానితో తృప్తి గలిగి జీవించటం వంటి ధర్మపన్నాలు, కాసెట్‌లమీద కెక్కించి వినిపించాడు నేను పంపిన వారి ద్వారానే. డబ్బు మూలుగుతున్నా యివ్వకపోతే దోషం కానప్పుడు, వుద్రేకంలో చంపించటమూ దోషమూ గాదు. కనకనే నేను దోషిని కాను'' అని చెప్పుకెళ్తున్న దోషికి అడ్డుపడ్డాడు ప్రాసిక్యూటర్, శేషావతారంగారు.

'' ఉద్రేకంలో చంపించలేదే నువ్వు? పథకం వేసే హత్య చేయించావు. అసలు అయిదు లక్షల దాకా అప్పెందుకైంది? డబ్బు యివ్వగలవారు, అందించేవారు వున్నారే నీకు? వారికెందుకు పట్టలేదు నీ సంగతీ? వారి నెందుకడగలేకపోయావూ? కిరాయి మనుషులే మానవత చూపి,

''చంపించకండి. నలుగురికీ సహాయపడేవానిని పరపతిగలవానిని చంపించటం హానికరం. హత్యా దాగదు. నిజమూ దాగదు. యెత్తుకు పోయి రాన్సమ్ అడగటం తెలివిగల పద్ధతి. మరొకర్ని పట్టుకోండి కిరాయి మూకచాలా వున్నది. దాగుతుందేమో చూతాము'' అని తెలివిగల మార్గం, నిరపాయకరమైందీ, డబ్బు వూడిపడేదీ చెపితే చేద్దైందా'' తప్పకుండా చూచుకుంటాను'' అని యీసడించావు. చేతగానివాడినా అని పొగరు వెల్లడించావు''! ''నా పరిస్థితిలో వున్న వారెవరైనా నాలాగే చేస్తారు. మనిషిని పోలిన మనిషి వుండచ్చు. నిర్దోషిని అరెస్టు చేశారంటాను'' అంటున్నాడు బోనులోని దోషి.

సుశీల సైగ అందుకుని, పోలీస్ వెళ్లి బోనులోని దోషిమొహాన అతుక్కుని వున్న అతని వంటిరంగులోనే వున్న రబ్బరు తొడుగు పల్చనిది లాగేశాడు.

ప్రేక్షకులలో వున్న శారద కళ్లు పెద్దవైనై. నోరు తెలిచింది. ''నిజంగానే చేయించాడా హత్య'' అని గొణుగుతూ కూలిపోతూ స్పృహ కోల్పోతున్నది.

మహిళా కాన్‌స్టేబుల్స్ వచ్చి మోసుకెళ్లి నేలమీదుంచి ప్రథమ చికిత్స చేసి సుశీల చెప్పగా దగ్గర్లో వున్న నర్సింగ్‌హోమ్‌కి కార్లో తీసికెళ్లారు.

బోనులోని దోషి, చెప్పుకెళ్తూనే వున్నాడు. ''హైస్కూల్ చదువులోనే హితోపదేశం మొదలైంది. నాకన్న తొమ్మిదేళ్ల చిన్నవాడు నాకు బోధకుడేమిటి? మా యిద్దరి మధ్య యింకా యిద్దరాడపిల్లలు పుట్టి పెరిగారు. వాడి పక్షమే వారూ. తల్లీదండ్రీ గూడా ''వాడిని చూసి నేర్చుకో'' అనేవారు ఒక్కోసారి మా వూరు పల్లె పట్టుకెళ్లి వూరంతా ముట్టిద్దామా అనిపించేది. నేను చూసిన మేచెస్ చెడగొట్టి తాను యెన్నిక చేసిన సంబంధాలు చేశాడు. అన్నిటిలో వేలు పెట్టటం, నా మాట నెగ్గకపోవటం అవీ వాడి పన్లు. అంతేనా యువరానర్, భార్యా బిడ్డలూ, అత్తారూ మరదలూ అంతా వాడిమీద పడే యేడిచారు యువరానర్. నాకు స్నేహితులు లేకుండా చేశాడు. అప్పు పుట్టకుండా చేశాడు. అదే నీతి. వాడు మాత్రం, విదేశీ సరుకు మాదక ద్రవ్యాలు, రహస్యంగా రవాణా చేసి మిలియనీరైనాడు. అదే నీతి. వాడినేదైనా పట్టగలిగారా? వారి చేతులు తడిపాడేమో. దేవుడూ వాడి పక్షమేనేమో యువరానర్ నేనెంత హానిచేసినా, యెగ్గుచేసినా వాడి సిగ పూవు వాడలేదు. నేను పాపరైతే వాడు మిలియనీరైనాడు. అసూయ పుట్టదా? ఈర్ష్య కలగదా? ఆ రెండూ యేమైనా చేయిస్తాయి మనిషిచేత. ఇదిగాదు పని అని. ఈ రాజాను ఖతమ్ చేయించాలని ఫూల్‌ప్రూఫ్ పథకం వేసి హార్డ్‌కోర్ క్రిమినల్సు పేరోల్ మీదున్న వారిని పట్టుకుని''.

రంగనాథంగారందుకుని బ్రేక్ వేశాడు. ''అదుగో చూశారా? అతని నోటిమీదిగానే నిజం బయటికొచ్చింది. నిజం దాగుతుందా? దానికి బయటపడే గుణమున్నది. పథకం వేసే చంపించానంటున్నాడు దోషి'' అని తర్జనితో దోషిని కోర్టువారికి చూపాడు.

''యేం చేయబోతున్నారు నన్ను ఖైదు చేస్తారా ఆజన్మాంతం? అహహా జీవితమే పెద్ద ఖైదు. యెన్నికట్టుబాట్లు? యెంత డ్రిల్లు పెరిగేదాకా? బందిఖానాలో మంచి తిండన్నా తిననిచ్చారా? జైలర్స్‌లాగా జైలు అధికారిలాగా, నామీద నిఘా,

బంధువులు భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు. ఓ యస్. పథకం వేసే చేయించాను హత్య. పనిచేసి చూపారు అదీ సంతోషం. స్వయంగా నేనే చేతును, కాని యీ చేతులతోనే నా తమ్ముడు రాజా నెత్తుకుని ఆడించాను. ఆనాడే వాడి గొంతు పిసికి గోడవతల పారేయాల్సింది. పొరపాటే చేశా'' అంటూ జుట్టు పీక్కుంటూ తెంపసాగాడు. కళ్లు తళతళలాడుతూ చక్రాల్లా అయి యెర్రబడినై. పళ్లన్నీ కనబడేట్టు విరగబడి నవ్వసాగాడు. ''రాజాకి అండర్‌వరల్డ్ గాఢ మిత్రులు వారే అందించి వారికొక్కవాల్సిన పన్లు చేయించుకుంటారు. మూడోకంటి వాడికి తెలియకుండా చేసి పెట్టగల సమర్థుడు నా తమ్మయ్య రాజా'' చొక్కా చింపుకుంటున్న దోషిని పోలీసులు భంట్రోతులూ వచ్చి.

''మతి చలించింది దోషికి. యేమి శిక్ష విధిస్తారో న్యాయాధిపతి'' అని గొణుగుతూ ఒక ఆయుర్వేద ఘనవైద్యుడు ప్రేక్షకులలోంచి లేచి కోర్టు వదిలివెళ్లిపోయాడు.

కోర్టు మూసే వేళైంది. న్యాయాధీశులు లేచారు.

5

శారదా, పిల్లలిద్దరూ, రాజా యింట్లోనే వాసవి వద్దే వుండిపోయారు. ఆమే వారిని వెళ్లనీయలేదు. ఇల్లు, వ్యాపారం అమ్మగలిగినవన్నీ అమ్మి అప్పులు తీర్చారు. ఒకళ్లనొకళ్లు వూరడించుకుంటూ కోలుకుంటూ బిజినెస్ రన్ చేస్తున్నారు.

దోషికి మంచి వైద్యమే అందించారు. వుధృతం తగ్గాక మళ్లా విచారణ జరిగింది. శిక్షాస్మృతి ననుసరించి అజన్మ కారాగారం వేశారు న్యాయాధీశులు.

కుటుంబ సభ్యులు దైవానికి ధన్యవాదాలిచ్చి దణ్ణాలు పెట్టారు. పిల్లల్ని పెద్దచేసి మంచి పౌరులుగా, వివేకం గలవారినిగా దిద్దబూనారు తల్లులు.

కథా నిలయం
5736
శ్రీకాకుళం